09-03-2024 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - ఇప్పుడు తిరిగి వెళ్ళాలి, అందుకే పాత దేహము మరియు పాత ప్రపంచము నుండి అతీతముగా అవ్వండి, మీ బ్యాటరీని చార్జ్ చేసుకునేందుకు యోగ భట్టీలో కూర్చోండి"

ప్రశ్న:- యోగములో బాబా నుండి పూర్తి కరెంట్ ఏ పిల్లలకు లభిస్తుంది?

జవాబు:- ఎవరి బుద్ధి అయితే బయట భ్రమించదో, ఎవరైతే స్వయాన్ని ఆత్మగా భావిస్తూ బాబా స్మృతిలో ఉంటారో, వారికి బాబా నుండి కరెంట్ లభిస్తుంది. తండ్రి పిల్లలకు సకాష్ ను ఇస్తారు. పిల్లల పని తండ్రి ఇచ్చే కరెంటును క్యాచ్ చేయడము ఎందుకంటే ఆ కరెంటుతోనే ఆత్మ రూపీ బ్యాటరీ చార్జ్ అవుతుంది, శక్తి వస్తుంది, వికర్మలు వినాశనమవుతాయి. దీనినే యోగ అగ్ని అని అంటారు, దీనిని అభ్యాసము చేయాలి.

ఓం శాంతి. భగవానువాచ - ఇప్పుడు పిల్లలకు ఇల్లు కూడా గుర్తుకు వస్తుంది. తండ్రి అయితే ఇల్లు మరియు రాజధాని యొక్క విషయాన్నే వినిపిస్తారు మరియు పిల్లలు కూడా - ఆత్మలమైన మా ఇల్లు ఏది, ఆత్మ ఏమిటి అనేది అర్థం చేసుకున్నారు. బాబా వచ్చి మమ్మల్ని చదివిస్తారు అన్న విషయాన్ని కూడా బాగా అర్థం చేసుకున్నారు. తండ్రి ఎక్కడి నుండి వస్తారు? పరంధామం నుండి. అంతేకానీ పావన ప్రపంచాన్ని తయారుచేయడానికి పావన ప్రపంచం నుండి వస్తారని అనరు. అలా కాదు. తండ్రి అంటారు, నేను సత్యయుగ పావన ప్రపంచం నుండి రాలేదు, నేను ఇంటి నుండి వచ్చాను, ఆ ఇంటి నుండే పిల్లలైన మీరు కూడా పాత్రను అభినయించడానికి వచ్చారు. నేను కూడా డ్రామా ప్లాన్ అనుసారంగా ప్రతి 5,000 సంవత్సరాల తర్వాత ఇంటి నుండి వస్తాను. నేను ఉండడం ఇంట్లో, పరంధామంలో ఉంటాను. తండ్రి ఒక పట్టణము నుండి వచ్చినట్లు ఎంతో సహజముగా అర్థం చేయిస్తారు. వారు అంటారు, ఏ విధముగా మీరు పాత్రను అభినయించడానికి వచ్చారో, అలా నేను కూడా అక్కడి నుండి పాత్రను అభినయించడానికి డ్రామా ప్లాన్ అనుసారంగా వచ్చాను. నేను నాలెడ్జ్ ఫుల్. డ్రామా ప్లాన్ అనుసారంగా నాకు అన్ని విషయాలను గురించి తెలుసు.

కల్ప-కల్పమూ నేను ఇదే విషయాన్ని మీకు వినిపిస్తాను. మీరు ఎప్పుడైతే కామచితిపై నల్లగా అయి భస్మమైపోతారో అప్పుడు నేను మీకు వినిపిస్తాను. అగ్నిలో మనుష్యులు నల్లగా అయిపోతారు కదా. మీరు కూడా నల్లగా అయిపోయారు. సతోప్రధానత యొక్క శక్తి అంతా పోయింది. ఆత్మ బ్యాటరీ పూర్తిగా డిస్చార్జ్ అయిపోయి మోటార్ నిల్చిపోయేలా అవ్వకూడదు. ఈ సమయంలో అందరి బ్యాటరీ డిస్చార్జ్ అయ్యే సమయం వచ్చేసింది, అందుకే తండ్రి అంటారు, డ్రామా అనుసారంగా నేను వస్తాను. ఆది సనాతన దేవీ-దేవతా ధర్మానికి చెందినవారు ఎవరైతే ఉన్నారో, వారి బ్యాటరీ చార్జ్ అవుతుంది. మీ బ్యాటరీ ఇప్పుడు తప్పకుండా చార్జ్ అవ్వనున్నది. కేవలం ఉదయంవేళ ఇక్కడకు వచ్చి కూర్చోవడం ద్వారా బ్యాటరీ చార్జ్ అవ్వగలదని కాదు. అలా కాదు. స్మృతిలో ఉన్నట్లయితే లేస్తూ, కూర్చుంటూ, నడుస్తూ కూడా బ్యాటరీ చార్జ్ అవ్వగలదు. మీరు మొదట పవిత్ర ఆత్మలుగా, సతోప్రధానముగా ఉండేవారు, సత్యమైన బంగారముగా, సత్యమైన నగలుగా ఉండేవారు. ఇప్పుడు తమోప్రధానముగా అయిపోయారు. ఇప్పుడు మళ్ళీ ఆత్మ సతోప్రధానముగా అయినట్లయితే శరీరము కూడా పవిత్రమైనది లభిస్తుంది. ఇది చాలా సహజముగా, పవిత్రముగా అయ్యేందుకు భట్టీ, దీనిని యోగ భట్టీ అని కూడా అనవచ్చు. బంగారాన్ని కూడా భట్టీలో వేస్తారు. ఇది బంగారాన్ని శుద్ధముగా తయారుచేసే భట్టీ, తండ్రిని స్మృతి చేసే భట్టీ. పవిత్రముగానైతే తప్పకుండా అవ్వాలి. స్మృతి చేయకపోతే అంత పవిత్రముగా అవ్వరు. ఇక లెక్కాచారాలను తీర్చుకోవలసిందే ఎందుకంటే ఇది వినాశ సమయము. అందరూ ఇంటికి వెళ్ళాలి. బుద్ధిలో ఇంటి స్మృతి కూర్చుని ఉంది. ఇది ఇంకెవరి బుద్ధిలోనూ ఉండదు. వారు బ్రహ్మమును ఈశ్వరుడు అని అనేస్తారు, దానిని ఇల్లుగా భావించరు. మీరు ఈ అనంతమైన డ్రామాలోని పాత్రధారులు, డ్రామాను మీరు బాగా తెలుసుకున్నారు. తండ్రి అర్థం చేయించారు, ఇప్పుడు 84 జన్మల చక్రము పూర్తవుతుంది, ఇప్పుడు ఇక ఇంటికి వెళ్ళాలి. ఆత్మ ఇప్పుడు పతితముగా ఉంది, అందుకే ఇంటికి వెళ్ళేందుకు - బాబా, మీరు వచ్చి పావనంగా చేయండి అని పిలుస్తుంది, లేదంటే మనము అక్కడికి వెళ్ళలేము. తండ్రే కూర్చుని ఈ విషయాలను పిల్లలకు అర్థం చేయిస్తారు. ఈ విషయాలను కూడా పిల్లలు అర్థం చేసుకున్నారు, అందుకే వారిని తండ్రి, తండ్రి అని అంటారు, టీచర్ అని కూడా అంటారు. మనుష్యులైతే శ్రీకృష్ణుడినే టీచర్ గా భావిస్తారు. శ్రీకృష్ణుడు తాను స్వయం సత్యయుగములో చదివేవారు అని పిల్లలైన మీరు భావిస్తారు. శ్రీకృష్ణుడు ఎప్పుడూ ఎవరికీ టీచర్ గా అవ్వలేదు. అలాగని వారు చదువుకొని తర్వాత టీచర్ గా అయ్యారు అని కూడా కాదు. శ్రీకృష్ణుడి బాల్యము నుండి మొదలుకుని పెద్దగా అయ్యేంత వరకూ మొత్తం కథను గురించి పిల్లలైన మీకే తెలుసు. మనుష్యులైతే శ్రీకృష్ణుడిని భగవంతునిగా భావిస్తూ - ఎక్కడ

చూసినా కృష్ణుడే కృష్ణుడు అని అనేస్తారు. రాముని భక్తులు - ఎక్కడ చూసినా రాముడే రాముడు అని అంటారు. దారం చిక్కుబడిపోయింది. భారత్ యొక్క ప్రాచీన యోగము మరియు జ్ఞానము ప్రసిద్ధమైనవి అని ఇప్పుడు మీకు తెలుసు, మనుష్యులకు ఏమీ తెలియదు. జ్ఞానసాగరుడు ఒక్క తండ్రే, వారు పిల్లలైన మీకు జ్ఞానాన్ని ఇస్తారు, కావున మిమ్మల్ని కూడా మాస్టర్ జ్ఞానసాగరులు అని అంటారు. కానీ, అది నంబరువారు పురుషార్థానుసారముగా. సాగరము అని అనాలా లేక నది అని అనాలా? మీరు జ్ఞానగంగలు, ఇందులో కూడా మనుష్యులు తికమకపడతారు. మాస్టర్ జ్ఞానసాగరులు అని అనడం చాలా కరెక్టు.

తండ్రి పిల్లలను చదివిస్తారు, ఇక్కడ స్త్రీ, పురుషుల విషయం లేదు. వారసత్వాన్ని కూడా ఆత్మలైన మీరందరూ తీసుకుంటారు, అందుకే తండ్రి అంటారు, దేహీ-అభిమానులుగా అవ్వండి. ఏ విధముగా పరమాత్మనైన నేను జ్ఞానసాగరుడినో, అలా మీరు కూడా జ్ఞానసాగరులు. నన్ను పరమపిత పరమాత్మ అని అంటారు, నా డ్యూటీ అందరికన్నా ఉన్నతమైనది. రాజు, రాణుల డ్యూటీ కూడా అందరికన్నా ఉన్నతముగా ఉంటుంది కదా, అలా మీ డ్యూటీ కూడా ఉన్నతముగా ఉంచడం జరిగింది. ఇక్కడ ఆత్మలమైన మనం చదువుతామని, పరమాత్మ చదివిస్తారని మీకు తెలుసు, అందుకే దేహీ-అభిమానీ భవ. అందరూ సోదరులవుతారు. తండ్రి ఎంతగా కష్టపడతారు. ఇప్పుడు ఆత్మలైన మీరు జ్ఞానాన్ని తీసుకుంటున్నారు. తర్వాత అక్కడకు వెళ్ళాక ప్రారబ్ధము నడుస్తుంది. అక్కడ అందరి మధ్యా సోదర ప్రేమ ఉంటుంది. సోదర ప్రేమ చాలా బాగా ఉండాలి. కొందరికి గౌరవాన్ని ఇవ్వడము, కొందరికి ఇవ్వకపోవడము... ఇలా ఉండకూడదు. వారు హిందు, ముస్లిం భాయి-భాయి అని అంటారు కానీ ఒకరికొకరు వారు గౌరవాన్ని ఇచ్చుకోరు. సోదరీ-సోదరులు అని కాదు, సోదరులు అని అనడం కరెక్టు. బ్రదర్ హుడ్ (సోదర భావము) అని అంటారు. ఆత్మ ఇక్కడకు పాత్రను అభినయించడానికి వచ్చింది. అక్కడ కూడా సోదరులుగానే ఉంటారు. ఇంటిలో తప్పకుండా అందరూ సోదరులుగా ఉంటారు. సోదరీ-సోదరులు అని పిలువబడే ఈ వస్త్రాలను ఇక్కడే విడిచిపెట్టాల్సి ఉంటుంది. భాయి, భాయి (సోదర) జ్ఞానాన్ని తండ్రే ఇస్తారు. ఆత్మ భృకుటి మధ్యలో ఉంటుంది. మీరు కూడా దృష్టిని అక్కడే ఉంచాలి. ఆత్మయైన మనం శరీరము రూపీ సింహాసనముపై కూర్చున్నాము. ఇది ఆత్మ సింహాసనము లేక అకాల సింహాసనము. ఆత్మను ఎప్పుడూ మృత్యువు కబళించదు. అందరి ఆసనము ఈ భృకుటి మధ్యలోనే ఉంటుంది. దానిపై అకాల ఆత్మ కూర్చుని ఉంది. ఇవి ఎంతగా అర్థం చేసుకోవలసిన విషయాలు. పసిపిల్లలలోకి కూడా ఆత్మ వెళ్ళినప్పుడు భృకుటి మధ్యలోనే కూర్చుంటుంది. ఆ చిన్న సింహాసనము మళ్ళీ పెద్దగా అవుతూ ఉంటుంది. ఇక్కడ గర్భములో ఆత్మ దుఃఖాన్ని అనుభవించవలసి ఉంటుంది, అప్పుడు - నేను ఇంకెప్పుడూ పాపాత్మగా అవ్వను అని పశ్చాత్తాపపడతుంది. అర్ధకల్పం పాపాత్ములుగా అవుతారు. ఇప్పుడు తండ్రి ద్వారా పావన ఆత్మలుగా అవుతారు. మీరు తనువు, మనస్సు, ధనము సర్వస్వాన్ని తండ్రికి ఇచ్చేస్తారు, ఇంతటి దానము గురించి ఎవరికీ తెలియదు. దానాన్ని తీసుకునేవారు మరియు ఇచ్చేవారు కూడా భారత్ లోకే వస్తారు. ఇవన్నీ అర్థం చేసుకోవలసిన సూక్ష్మమైన విషయాలు. భారత్ ఎంతటి అవినాశీ ఖండముగా అయ్యింది, మిగిలిన ఖండాలన్నీ అంతమవ్వనున్నాయి. ఇది రచింపబడి ఉన్న డ్రామా. ఇది మీ బుద్ధిలో ఉంది. ఇది ప్రపంచానికి తెలియదు. దీనిని జ్ఞానము అని అనడం మంచిది. జ్ఞానము సంపాదనకు ఆధారము, దీనీ ద్వారా ఎంతో సంపాదన కలుగుతుంది. తండ్రిని స్మృతి చేయండి, వారు ఈ జ్ఞానాన్ని కూడా ఇస్తారు, మళ్ళీ సృష్టిచక్ర జ్ఞానాన్ని కూడా ఇస్తారు. ఇందులో శ్రమ ఉంది. ఆత్మలమైన మనం ఇప్పుడు తిరిగి వెళ్ళాలి, అందుకే ఈ పాత ప్రపంచము మరియు పాత శరీరము నుండి ఉపరామముగా ఉండాలి. దేహ సహితంగా ఏదైతే చూస్తున్నారో, అదంతా అంతమవ్వనున్నది. ఇప్పుడు మనం ట్రాన్స్ఫర్ అవుతాము. ఈ విషయాలను తండ్రే తెలియజేయగలరు. ఇది చాలా పెద్ద పరీక్ష, దీనిని తండ్రే చదివిస్తారు. ఇందులో పుస్తకాలు మొదలైనవాటి అవసరం లేదు. తండ్రిని స్మృతి చేయాలి. తండ్రి 84 జన్మల చక్రాన్ని అర్థం చేయిస్తారు. డ్రామా యొక్క కాల పరిమితిని గురించైతే ఎవ్వరికీ తెలియదు, ఘోర అంధకారములో ఉన్నారు. మీరు ఇప్పుడు మేల్కొన్నారు, మనుష్యులైతే మేల్కోరు. మీరు ఎంతగా కష్టపడుతున్నారు, భగవంతుడు వచ్చి వీరిని చదివిస్తున్నారు అని వారు విశ్వసించరు. తప్పకుండా ఎవరో ఒకరిలోకి వస్తారు కదా. మీరు మనుష్యులు అర్థం చేసుకునే విధంగా చేయండి అని తండ్రి ఆత్మలకు సలహాను ఇస్తారు. మీ కొరకు ఇది సహజము. నంబరువారుగా అయితే ఉన్నారు కదా. స్కూల్లో కూడా నంబరువారుగా ఉంటారు, చదువులో కూడా నంబరువారుగా ఉంటారు. ఈ చదువు ద్వారా పెద్ద రాజ్యము స్థాపన అవుతోంది. పురుషార్థము ఎలా చేయాలంటే దాని ద్వారా మనం రాజులుగా అవ్వాలి. ఈ సమయంలో మీరు ఏ పురుషార్థమునైతే చేస్తారో, దానిని కల్పకల్పాంతరాలూ చేస్తూ ఉంటారు. దీనిని ఈశ్వరీయ లాటరీ అని అంటారు. కొందరికి చిన్న, కొందరికి పెద్ద లాటరీ లభిస్తుంది. రాజ్యము యొక్క లాటరీ కూడా ఉంది. ఆత్మ ఎటువంటి కర్మలను చేస్తుందో, అటువంటి లాటరీ లభిస్తుంది. కొందరు పేదవారిగా అవుతారు, కొందరు షావుకార్లుగా అవుతారు. ఈ సమయంలో పిల్లలైన మీకు మొత్తం లాటరీ

అంతా తండ్రి నుండి లభిస్తుంది. ఈ సమయపు పురుషార్థము పైనే ఎంతో ఆధారపడి ఉంది. నెంబర్ వన్ పురుషార్థము స్మృతి. కావున మొదట యోగబలము ద్వారా స్వచ్ఛముగానైతే అవ్వండి. ఎంతగా మనం తండ్రిని స్మృతి చేస్తామో అంతగా జ్ఞాన ధారణ జరుగుతుందని మరియు అనేకులకు అర్థం చేయించి మన ప్రజలుగా తయారుచేసుకుంటామని మీకు తెలుసు. ఏ ధర్మం వారైనా కానీ ఎప్పుడైతే పరస్పరం కలుసుకుంటారో, అప్పుడు తండ్రి పరిచయాన్ని ఇవ్వండి. వినాశనం తమ ఎదురుగా నిలబడి ఉందని ముందుముందు వారు చూస్తారు. వినాశన సమయములో మనుష్యులకు వైరాగ్యము కలుగుతుంది. అప్పుడు మనం - మీరు ఒక ఆత్మ అని మాత్రమే చెప్పవలసి ఉంటుంది. హే గాడ్ ఫాదర్! అని ఎవరు అన్నారు? ఆత్మ. ఇప్పుడు తండ్రి ఆత్మలతో అంటున్నారు - నేను మీ గైడ్ గా అయి మిమ్మల్ని ముక్తిధామములోకి తీసుకువెళ్తాను. ఇకపోతే ఆత్మ ఎప్పుడూ వినాశనమవ్వదు కావున మోక్షము యొక్క ప్రశ్న కూడా లేదు. ప్రతి ఒక్కరూ తమ-తమ పాత్రను అభినయించాలి. ఆత్మలన్నీ అవినాశీ, అవి ఎప్పుడూ వినాశనమవ్వవు. ఇకపోతే అక్కడికి వెళ్ళేందుకు తండ్రిని స్మృతి చేయండి, అప్పుడు వికర్మలు వినాశనమవుతాయి, ఇంటికి వెళ్ళిపోతారు. చివరి సమయములో గొప్ప-గొప్ప సన్యాసులు కూడా అర్థం చేసుకుంటారు, అందరూ తిరిగి వెళ్ళవలసిందే. మీ సందేశము అందరి బుద్ధులలో ముద్రించబడుతుంది, అందుకే - ఓహో ప్రభూ... మీరు ఇచ్చే గతి, మీరు చూపే మార్గము అతీతమైనవి అని అంటారు. కావున తప్పకుండా తమ మతాన్ని ఎవరికో ఒకరికి ఇస్తారా లేక తమ వద్దే ఉంచుకుంటారా? వారి మతము ద్వారా సద్గతి ఎలా లభిస్తుంది అనేది తప్పకుండా తెలియజేస్తారు కదా. కానీ వాళ్ళేమో - మీరు ఇచ్చే గతి, మీరు చూపే మార్గము మీకే తెలుసు, మాకు తెలియదు అని అంటారు. దీనికేమైనా అర్థముందా? తండ్రి అంటారు, ఈ శ్రీమతము ద్వారా మీకు గతి లభిస్తుంది.

బాబాకు ఏదైతే తెలుసో, అది మనకు నేర్పిస్తున్నారని ఇప్పుడు మీకు తెలుసు. మాకు బాబా గురించి తెలుసు అని మీరు అంటారు. వారు - మీరు ఇచ్చే గతి, మీరు చూపే మార్గము మీకే తెలుసు అని అంటారు, కానీ మీరు అలా అనరు. బుద్ధిలో మొత్తం జ్ఞానమంతా కూర్చోవాలంటే, దానికి కూడా సమయం పడుతుంది. అప్పుడే ఇంకా ఎవరూ సంపూర్ణులుగా అవ్వలేదు. సంపూర్ణులుగా అయినట్లయితే ఇక్కడి నుండి వెళ్ళిపోతారు. కానీ వెళ్ళేది అయితే లేదు. ఇప్పుడు అందరూ పురుషార్థము చేస్తున్నారు. బాబాకు మొదట ఎంతో తీవ్రముగా వైరాగ్యము కలిగింది. నేను ద్వికిరీటధారునిగా అవుతున్నాను అని చూసారు. ఇది కూడా డ్రామానుసారంగా బాబా చూపించారు. నేను వెంటనే సంతోషించాను, ఆ సంతోషములో అంతా విడిచిపెట్టేసాను. వినాశనాన్ని చూసాను, చతుర్భుజుడినీ చూసాను. ఇప్పుడు ఇక రాజ్యం లభిస్తోంది, కొన్ని రోజుల్లో వినాశనమైపోతుంది అని భావించాను, ఇలా నషా ఎక్కింది. అవును, అది కరెక్టు అని ఇప్పుడు అర్థమవుతుంది, రాజధాని తయారవుతుంది. ఈ రాజ్యం అనేకులకు లభించనున్నది, నేనొక్కడినే వెళ్ళి ఏమి చేస్తాను. ఈ జ్ఞానం ఇప్పుడే లభిస్తుంది. మొదట సంతోషపు పాదరసము పైకి ఎక్కింది. పురుషార్థమునైతే అందరూ చేయాలి. మీరు పురుషార్థము కొరకు కూర్చున్నారు. ఉదయంవేళ స్మృతిలో కూర్చుంటారు. ఇలా కూర్చోవడం కూడా మంచిదే. బాబా వచ్చారని మీకు తెలుసు. బాబా వచ్చారా లేక దాదా వచ్చారా, బెల్లం రుచి బెల్లానికి మరియు బెల్లం సంచికి మాత్రమే తెలుసు అన్నట్లుగా ఇదీ అంతే. వారు ఒక్కొక్క బిడ్డను చూస్తూ ఉంటారు. కూర్చొని ఒక్కొక్కరికి సకాష్ ను ఇస్తారు. ఇది యోగాగ్ని కదా. యోగాగ్ని ద్వారా వికర్మలు భస్మమైపోతాయి. వారు కూర్చొని లైటే ఇస్తారు. ఒక్కొక్క ఆత్మకు సెర్చ్ లైట్ ను ఇస్తారు. నేను కూర్చొని ప్రతి ఆత్మకూ కరెంట్ ఇస్తాను, అప్పుడు దానితో వారిలో శక్తి నిండుతూ ఉంటుంది. ఒకవేళ ఎవరి బుద్ధి అయినా బయట భ్రమిస్తూ ఉన్నట్లయితే వారు ఆ కరెంట్ ను క్యాచ్ చేయలేరు. బుద్ధి ఎక్కడో అక్కడ భ్రమిస్తూ ఉంటుంది. మరి వారికి ఏమి లభిస్తుంది? ప్రేమ ఇస్తే ప్రేమ లభిస్తుంది అని అంటారు. బుద్ధి బయట భ్రమిస్తూ ఉన్నట్లయితే బ్యాటరీ చార్జ్ అవ్వదు. తండ్రి బ్యాటరీని చార్జ్ చేయడానికి వస్తారు, సేవ చేయడం వారి కర్తవ్యము. పిల్లలు సేవను స్వీకరిస్తారా లేదా అన్నది వారి ఆత్మకే తెలుస్తుంది. ఏ ఆలోచనలతో కూర్చున్నారు అన్న విషయాలన్నీ తండ్రి అర్థం చేయిస్తారు. నేను కూడా పరమ ఆత్మను. బ్యాటరీనైన నాతో మీరు యోగాన్ని జోడిస్తారు. నేను కూడా సకాష్ ను ఇస్తాను. ఎంతో ప్రేమగా ఒక్కొక్కరికీ సకాష్ ను ఇస్తాను. మీరు తండ్రిని స్మృతి చేయడానికి కూర్చుంటారు. బాబా అంటారు, నేను ఒక్కొక్క ఆత్మకు సకాష్ ను ఇస్తాను. ఎదురుగా కూర్చొని లైట్ ఇస్తాను. కానీ మీరైతే అలా చేయరు. దానిని అందుకొనేవారు అందుకుంటారు మరియు వారి బ్యాటరీ చార్జ్ అవుతుంది. బాబా రోజురోజుకు యుక్తులనైతే తెలియజేస్తూ ఉంటారు. కానీ అర్థం చేసుకున్నారా, లేదా? అన్నది నంబరువారుగా విద్యార్థులపై ఆధారపడి ఉంటుంది. మీకు చాలా తాజా సరుకు లభిస్తోంది. కానీ దానిని అరిగించుకోవాలి కూడా కదా. ఇది చాలా పెద్ద లాటరీ. ఇది జన్మజన్మాంతరాల, కల్పకల్పాంతరాల లాటరీ. దీనిపై పూర్తి అటెన్షన్ ను ఉంచాలి. బాబా నుండి మనం కరెంట్ తీసుకుంటున్నాము. తండ్రి కూడా భృకుటి మధ్యలో వీరి ప్రక్కన కూర్చున్నారు. మీరు కూడా స్వయాన్ని ఆత్మగా భావిస్తూ తండ్రిని స్మృతి చేయాలి, అంతేకానీ బ్రహ్మను కాదు. మనం

వారితో యోగాన్ని జోడించి కూర్చున్నాము. వీరిని చూస్తూ కూడా మనం వారిని చూస్తాము. ఇది ఆత్మ విషయమే కదా. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. ఆత్మను స్వచ్ఛముగా తయారుచేసుకునేందుకు ఉదయముదయమే లేచి తండ్రి నుండి సెర్చ్ లైట్ ను తీసుకోవాలి, బుద్ధియోగాన్ని బయటి నుండి తొలగించి ఒక్క తండ్రితో జోడించాలి. తండ్రి ఇచ్చే కరెంటును క్యాచ్ చేయాలి.

2. పరస్పరంలో సోదరభావముతో కూడిన సత్యమైన ప్రేమతో ఉండాలి. అందరికీ గౌరవాన్ని ఇవ్వాలి. ఆత్మా రూపీ సోదరుడు అకాల సింహాసనముపై విరాజమానమై ఉన్నారు, అందుకే భృకుటిలోనే చూస్తూ మాట్లాడాలి.

వరదానము:- మీ సంపర్కము ద్వారా అనేక ఆత్మల చింతలను తొలగించే సర్వులకు ప్రియ భవ

వర్తమాన సమయములో వ్యక్తులలో స్వార్థ భావము ఉన్న కారణంగా మరియు వైభవాల ద్వారా అల్పకాలిక ప్రాప్తి లభిస్తున్న కారణంగా ఆత్మలు ఏదో ఒక చింతలో వ్యాకులంగా ఉన్నారు. శుభచింతక ఆత్మలైన మీ కొద్ది సమయపు సంపర్కము కూడా ఆ ఆత్మల చింతలను తొలగించేందుకు ఆధారంగా అవుతుంది. ఈ రోజు విశ్వానికి మీలాంటి శుభచింతక ఆత్మల అవసరముంది, అందుకే మీరు విశ్వానికి అతి ప్రియులు.

స్లోగన్:- వజ్రతుల్య ఆత్మలైన మీ మాటలు కూడా రత్న సమానంగా విలువైనవిగా ఉండాలి.